సాక్షి ఏలూరు

మంగళవారం ౹ 22 ౹ జూలై ౹ 2025



లారీ ఢీకొని మహిళ మృతి
వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లిన మహిళ ఆస్పత్రికి చేరకుండానే మృతి చెందిన సంఘటన ముసునూరు మండలంలో జరిగింది.
10లో ▸



వరిని ముంచిన వరుణుడు
రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆచంట నియోజకవర్గంలో నారుమడులు, వరినాట్లు నీటమునిగాయి.
10లో ▸



సింగవరంలో తాగునీటి కష్టాలు
దెందులూరు మండలం సీతంపేట పంచాయతీ సింగవరంలో తాగునీటి కష్టాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
10లో ▸

నిలువునా దోచేయ్ తమ్మి..

- ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేల చేతుల్లో తమ్మిలేరు విధ్వంసం
- అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు.. గట్లపై పచ్చ రాబందులు
- రాత్రింబవళ్లు వందల టిప్పర్లతో భారీగా అక్రమ రవాణా
- ఏలూరు నగర శివారులో ఓ ఎమ్మెల్యే ముఠా అరాచకం
- ఐదు కిలోమీటర్ల దూరంలో మరో ఎమ్మెల్యే టీమ్ దందా
- ఇప్పటికే ఇసుక స్వాహా.. గట్ల విధ్వంసంతో గ్రావెల్ కూడా



తవ్వేయ్.. తరలించేయ్.. తమ్మిలేరులో అక్రమంగా చేస్తున్న గ్రావెల్ తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఇప్పటికే ఇసుకను ఆసాంతం తోడేశారు...! ఇప్పుడు గ్రావెల్‌పై పడ్డారు..! ఏలూరు జిల్లాలోని తమ్మిలేరును ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేల ముఠాలు ఎడాపెడా తవ్వేస్తున్నారు..! అది కూడా ఏరులోని గ్రావెల్‌ను కాకుండా గట్లను ధ్వంసం చేస్తుండటం గమనార్హం..! ఇద్దరు ప్రజా ప్రతినిధుల పచ్చ ముఠాలు పోటీ పడి తవ్వకాలు చేపడుతూ విచ్చలవిడి విక్రయాలకు తెరతీశారు. పగలు, రాత్రి తేడా లేకుండా భారీ జేసీబీలతో తవ్వి నిత్యం వందల లారీల్లో గ్రావెల్‌ను తరలిస్తున్నా అటు జల వనరుల శాఖ అధికారులు గాని, ఇటు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం స్పందించకపోవడం గమనార్హం.

తెలంగాణలోని ఖమ్మం జిల్లా పోతువారిగూడెంలో ప్రారంభమై వందల మైళ్ల ప్రయాణంతో చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాల మీదుగా ఏలూరు రూరల్ మండలం నుంచి ఏలూరులోకి ప్రవేశిస్తుంది తమ్మిలేరు. తూర్పు, పశ్చిమ తమ్మిలేరుగా విడిపోయి కొల్లేరులో కలిసే సహజ సిద్ధ కాల్వ ఇది. దశాబ్దాలకోసారి తమ్మిలేరుకు వరద వస్తుంది. దీంతో ఏలూరు నగరం జల దిగ్బంధం అవుతుంది. 1960 నుంచి ఇప్పటివరకు 4–5 సార్లు ఇలా జరిగింది.

పచ్చ రాబందుల కన్ను

ఇలాంటి తమ్మిలేరుపై పచ్చ రాబందుల కన్నుపడింది. కూటమి ప్రభుత్వం రాగానే విరుచుకుపడి దాదాపు 16 ప్రాంతాల్లో విచ్చలవిడిగా తవ్వేసి వేల ట్రాక్టర్ల ఇసుకను విక్రయించారు. ఇప్పుడు గ్రావెల్‌పై పడ్డారు.

రోడ్డు వేసి మరీ..

ప్రత్యేక చెక్‌పోస్టులు, ప్రత్యేక బృందాల కనుసన్నల్లో తమ్మిలేరులోకి రోడ్డు వేసి తవ్వేస్తున్నారు. ఏలూరు శివారు ప్రభుత్వ హౌసింగ్ వెంచర్ సమీపం నుంచి తమ్మిలేరులోకి రోడ్డు ఏర్పాటు చేశారు. వెంచర్ వద్ద నలుగురు మనుషులతో చెక్‌పోస్టు పెట్టారు. అక్కడ పనిచేసే సిబ్బంది, లారీ డ్రైవర్ల భోజన విరామం, షిప్టులు మారే సమయం మినహా రోజులో 18 నుంచి 20 గంటల వరకు అడ్డగోలు తవ్వకాలు సాగిస్తున్నారు. భారీ జేసీబీలతో పది అడుగుల గట్లను తవ్వి లారీల్లో నింపుతున్నారు. ఒక్కో లారీ గ్రావెల్‌ను సగటున రూ.7 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు.

- పెదవేగి మండలం వంగూరు సమీపంలోని తమ్మిలేరులో తవ్వకాలు నిరంతరం సాగుతున్నాయి. ఓ ఎమ్మెల్యే ముఠా ప్రధాన రహదారి వెంట పట్టపగలే ప్రైవేట్ సెక్యూరిటీ నడుమ గ్రావెల్ దందా కొనసాగిస్తోంది. దాదాపు కిలోమీటరు పైగా గట్టును ధ్వంసం చేసి వందల టిప్పర్లలో తరలించారు.
- అక్కడనుంచి కొద్ది కిలోమీటర్ల దూరంలో మరో ఎమ్మెల్యే ముఠా తమ్మిలేరు గ్రావెల్‌ను, సిల్ట్ ఇసుకను తవ్వుతోంది. జానంపేటలోని పోలవరం అక్విడెక్ట్ దాటిన తర్వాత ఇదే తరహాలో ప్రత్యేక టీమ్ పర్యవేక్షణలో రాత్రింబవళ్లు తవ్వకాలు సాగించి గ్రావెల్‌ను విక్రయిస్తున్నారు.
- ఏలూరు శివారులోని పచ్చ ముఠా ఏలూరు, కైకలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో, జానంపేటలోని మరో ముఠా దెందులూరు, చింతలపూడి, నూజివీడులో విక్రయాలు సాగిస్తోంది.
- రోజూ రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల విలువైన గ్రావెల్‌ను దోచుకుంటున్న సంగతి అధికారులకు తెలిసినా కనీసం కేసులు కూడా లేకపోవడం గమనార్హం.

టీడీపీ కార్యకర్తల దాడి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: దెందులూరు వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర తండ్రి బసవ పున్నయ్యపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దాడి చేసి పామాయిల్ గెలలను అపహరించడం ఘర్షణకు దారి తీసింది. సోమవారం కొప్పులవారిగూడెంలో తన పొలంలో పామాయిల్ గెలలను కో సుకుని ఫ్యాక్టరీకి తీసుకువెళుతుండగా టీడీపీ కార్యకర్తలు అడ్డగించి కళ్లల్లో కారం కొట్టి ఐదు టన్నుల లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను తీసుకువెళ్లారని బాధితుడు బసవ పున్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో తమ కుటుంబాన్ని అన్నిరకాలుగా నష్టపరుస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని వాపోయారు. దాడిని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. బసవ పున్నయ్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. జరిగిన సంఘటనపై మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి జిల్లా ఎస్పీ ప్రతాప శివకిషోర్, అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావులతో ఫోన్ లో మాట్లాడారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగింపు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో దాటవేత ధోరణి అవలంబించడంపై ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్మికుల జీతాలు మొక్కుబడిగా పెంచడం గర్హనీయమని విమర్శించారు. తాము సమ్మె చేస్తుంటే ప్రభుత్వ స్పందన అసంతృప్తిని మిగిల్చిందన్నారు. కార్మికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం కోసం మంగళవారం కూడా స మ్మెను కొనసాగించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు.

న్యూస్‌రీల్

గళమెత్తిన అంగన్‌వాడీలు



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలంటూ ఏలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని నినాదాలు చేశారు. సంఘ ఏలూరు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే సమీమా, రజని మాట్లాడుతూ 2022లో ఇచ్చిన మొబైల్ ఫోన్స్‌లో యాప్‌లు పనిచేయడం లేదన్నారు. అయినా యాప్‌లో అప్‌లోడ్ చేయకపోతే సరుకులు ఇవ్వమని చెప్పడం సరికాదన్నారు. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య ఉందని, అలాగే గర్భిణులు బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సంఘ జిల్లా నాయకులు పి.హైమావతి, సీఐటీయూ నాయకులు ఎం.ఇస్సాకు, పంపన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో జనం జేబులు ఖాళీ

ద్వారకాతిరుమల: స్మార్ట్ మీటర్లతో చంద్రబాబు ప్రభుత్వం ప్రజల జేబులు ఖాళీ చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంగోపాల్ విమర్శించారు. స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని ఆయన కోరారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృత సమావేశాల్లో భాగంగా ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను అదానీ ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం వివిధ రాష్ట్రాలపై రుద్దుతోందని ఆయన విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరాం మాట్లాడుతూ ఆయిల్‌పామ్, కోకో లాంటి పంటలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు.

రైతుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఏలూరు (టూటౌన్): ఉంగుటూరు మండలం రావులపర్రులో సుమారు 150 ఎకరాల్లో వరి నారుమడులు నీట మునిగాయని, రావులపర్రు–రాచూరు మధ్య పూడిక తీయించాలని కోరుతూ రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వికి కలిసి వినతిపత్రం అందించారు. ఇరిగేషన్ అధికారులకు తమ ఆవేదన పట్టడం లేదని రైతులు బయ్యవరపు శ్రీను, ఎడవల్లి శ్రీను, నల్లి హరికృష్ణ, తాడిశెట్టి రాజకుమార్ అన్నారు.

పర్మినెంట్ చేయాలి

నూజివీడు: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని మున్సిపాలిటీ ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎదురేసి అప్పారావు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ నూజివీడు మున్సిపాలిటీలోని కాంట్రాక్టు ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం ఎనిమిదో రోజుకు చేరింది. నాయకులు లటికే రంగారావు, రామారావు పాల్గొన్నారు.

డ్రాపౌట్లపై సమీక్ష

ఏలూరు(మెట్రో): జిల్లాలో బడి ఈడు పిల్లలందరినీ బడి చేర్చి డ్రాపౌట్లు లేరని పాఠశాల, గ్రామ, మండల స్థాయిల్లో నిర్ధారించి ఈనెల 25 లోపు తీర్మానం చేసి సమర్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. సోమవారం విద్య, ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో డ్రాపౌట్లు, చదువు మధ్యలో ఆపివేసిన బాలికల వివరాల సేకరణపై ఆమె సమీక్షించారు. అలాగే జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం–2025 పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలనే సందేశ పోస్టర్లను ఆవిష్కరించారు.

162 మి.మీ. వర్షపాతం

ఏలూరు(మెట్రో): జిల్లాలోని 27 మండలాల్లో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు 162.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మండవల్లిలో 33.8 మి.మీ., కామవరపుకోటలో 25.2, పెదపాడులో 24.8, ముదినేపల్లిలో 20.2, ఆగిరిపల్లిలో 16.2, ద్వారకాతిరుమలలో 10.2, కైకలూరులో 7.4. ఏలూరు నగరంలో 7.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు 200 మి.మీ. వర్షం కురిసినట్టు అంచనా.

హామీలు మరచి రెడ్‌బుక్ పాలన



కామవరపుకోటలో నిరసన తెలుపుతున్న ఇన్‌చార్జి విజయరాజు, పార్టీ శ్రేణులు

వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి విజయరాజు

కామవరపుకోట: సూపర్ సిక్స్ పథకాలు అంటూ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన తర్వాత హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు మండిపడ్డారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ సోమవారం స్థానిక కొత్తూరు బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఉప్పలపాడులో మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో డైవర్షన్ రాజకీయాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమ అరెస్టులు చేయిస్తోందన్నారు. ప్రశ్నించేవారు ఉండకూడదూ అన్నట్లు ఉన్మాద చర్యలకు దిగడం హేయమన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చేలా ఇంటింటా కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కేసరి సరితారెడ్డి, జిల్లా డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, వైస్ ఎంపీపీలు తమ్మిశెట్టి గిరిజ, కనికెళ్ళ రత్నకుమారి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, టౌన్ ప్రెసిడెంట్ నానది సాగర్, గుర్రాల రవికుమార్, దేవరపల్లి రామ్మోహన్‌రావు, ప్రచార కమిటీ సభ్యులు మేరుగు బాబురావు, కేసరి రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



వేలేరుపాడులో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: ముందుగా ముంపునకు గురవుతున్న గ్రామాలను 41 కాంటూర్ పరిధిలో కలిపి పునరావాసం కల్పించాలంటూ అఖిల పక్షం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వేలేరుపాడు ప్రధాన సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ సుద్దగుంపు, తాట్కూర్ గొమ్ము కాలనీ, నడిమిగొమ్ము, ఎర్రబోరు, పాతపూచిరాల, మద్దిగట్ల, పడమటిమెట్ట చాకరపల్లి కుర్రాజులగూడెం, గీగావారిగుంపు తదితర పల్లపు గ్రామాలు 41 కాంటూర్‌లో కలిపి వెంటనే పరిహారం అందించాలన్నారు. వరదల సమయంలో ఉండేందుకు చోటు లేక ఉపాధి లేక నరకయాతన అనుభవిస్తున్నామన్నారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆదాయానికి కూటమి గండి

- తక్కువ అద్దెకు షాపు ఖరారు
- ఏఎంసీ చైర్మన్‌కు లబ్ధి చేకూర్చేలా పావులు



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

ఏలూరు (టూటౌన్): ఏలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుమారుడికి షాపు కేటాయించేందుకు ఏకంగా మున్సిపల్ కౌన్సిల్ స్థాయి సంఘ సమావేశంలో అనుబంధ అజెండాలో చేర్చడం విమర్శలకు తావిస్తోంది. నెలకు రూ.45 వేలు అద్దె వచ్చే షాపును కేవలం రూ.18 వేలకే కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడింది. వివరాలిలా ఉన్నాయి.. ఏలూరులోని చందన బ్రదర్స్ సెంటర్‌లో కస్తూరిబా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నం.2 మామిళ్లపల్లి పార్థసారథి పేరున 15 ఏళ్లుగా ఉంది. దానికి అద్దె నెలకు రూ.45 వేలు. ఇటీవల పార్థసారథి ఏఎంసీ చైర్మన్‌గా నియమితులవడంతో పాటు టీడీపీకి చెందిన కీలక నేత కావడంతో కొత్త అంకానికి తెర తీశారు. గుట్టుచప్పుడు కాకుండా ఆ షాపును ఖాళీ చేసి తిరిగి వేలం వేసేలా పావులు కదిపారు. జూన్ 23, ఈనెల 27న వేలం వేయగా ఎవరూ రాకుండా జాగ్రత్త పడ్డారు. ఈనెల 17న మూడోసారి వేలం నిర్వహించగా మూడు టెండర్లు వచ్చాయి. వీరంతా సదరు టీడీపీ నేత కుమారుడు, అనుయాయులు కావడం విశేషం. మామిళ్లపల్లి నందగోపాల్, వగ్వాల గణపతిరావు, షేక్ మీరా సాహెబ్ టెండర్లు వేయగా హెచ్చు మొత్తం నెలకు రూ.18 వేలకు టెండర్ వేసిన నంద గోపాల్‌కు షాపు దక్కింది. ఈ మేరకు ఈనెల 21న జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కేవలం ఈ ఒక్కషాపునకు సంబంధించిన వేలాన్ని అనుబంధ అజెండాగా పెట్టి టెండర్‌ను ఖరారు చేశారు. ఇలా తండ్రి పేరు నుంచి కుమారుడి పేరు మీదకు షాపును బదలాయించారు. ఇదిలా ఉండగా ఇదే షాపునకు ప్రభుత్వ లెక్కల ప్రకారం నెలకు రూ.49,065 అద్దె నిర్ణయించారు. అయితే రూ.18 వేలకే ఖరారు చేయడం ద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం నెలకు రూ.31,065 గండి పడింది. మున్సిపల్ చట్టం ప్రకారం అప్పటివరకు ఉన్న అద్దె మొత్తం కన్నా ఎక్కువకే టెండర్ ఖరారు చేయాల్సి ఉంది. అయితే ఈ విధానాన్ని తుంగలో తొక్కడం విమర్శలకు తావిస్తోంది.

ఉద్యోగులు లేరు.. పని చేసేదెవరు?

- జిల్లా పరిషత్‌లో 662 పోస్టుల ఖాళీ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కుంటుపడిన పాలన
- కీలకమైన అకౌంట్స్ అధికారి పోస్టుదీ అదే పరిస్థితి
- 13 మండలాల్లో ఇన్‌చార్జి ఎంపీడీఓలే..
- పట్టించుకోని కూటమి సర్కారు



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ కార్యాలయం

ఏలూరు (మెట్రో): 'అధికారంలోకి వచ్చిన తరువాత ఏటా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టి నిరుద్యోగ వ్యవస్థను రూపుమాపుతాం' ఇవీ గతేడాది ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు పలికిన ప్రగల్భాలు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టే పనిలో నిమగ్నమైంది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఒక్క కొత్త ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదు. జిల్లాలో ప్రజలకు సుపరిపాలన అందాలన్నా.. సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో చేరువ కావాలన్నా జిల్లా పరిషత్ వ్యవస్థ ఎంతో కీలకం. అటు రాజకీయంగా, ఇటు పరిపాలన పరంగా పెనవేసుకుని ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌లో కీలకమైన ఉద్యోగాలన్నీ ఇన్‌చార్జిలతోనే కొనసాగుతున్నాయి. జిల్లా పరిషత్‌లోకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎంపీపీ కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాలు, ఇంజనీరింగ్ సెక్షన్‌లు ప్రజలకు సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంటాయి. అయినప్పటికీ జిల్లా పరిషత్‌లో వందలాది ఉద్యోగాలు భర్తీకి నోచుకోవడం లేదు. ఏళ్ల తరబడి ఖాళీగానే ఉంటున్నాయి. జిల్లా పరిషత్ వ్యవస్థలో ఏలూరులోని జెడ్పీ కార్యాలయంతో పాటు 15 విభాగాల్లో ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉంది. దీనిలో జిల్లా పరిషత్ కార్యాలయంలోని సీఈఓ, డిప్యూటీ సీఈఓ ఉద్యోగాలు మినహా మిగిలిన అన్ని విభాగాల్లోనూ కీలకమైన పోస్టులను ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు.

అకౌంట్స్ అధికారి కీలకం

ఉమ్మడి జిల్లాకు కీలకమైన అకౌంట్స్ అధికారి పోస్టు ఒక్కటే ఉంది. అయితే అదీ ఖాళీగా ఉంది. జిల్లా పరిషత్‌లోని అన్ని విభాగాలకు ఈ అధికారి ద్వారానే నిధులు బదిలీ అవుతాయి. ప్రతి రూపాయి విడుదల, ఖర్చుకు అకౌంట్స్ అధికారి కీలకంగా వ్యవహరిస్తారు. అయితే ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో నిధుల ఖర్చు ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఈ పోస్టు భర్తీపై పాలకులు దృష్టి సారించడం లేదు.

35 మంది ఎంపీడీఓలే..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 48 మండలాల్లో అభివృద్ధి పనులకు ఎంపీడీఓలు కీలకం. అయితే 35 మండలాల్లోనే పూర్తిస్థాయిలో ఎంపీడీఓలు ఉండగా.. 13 మండలాల్లో లేరు. దీంతో 13 మండలాల్లో ఇన్‌చార్జుల పాలనలో నెట్టుకొస్తున్నారు.


1,600 పోస్టులు.. 662 ఖాళీలు

పశ్చిమగోదావరి జిల్లాపరిషత్‌లో మొత్తం 1,600 పోస్టులకు గాను 938 పోస్టుల్లో మాత్రమే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 662 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్ని పోస్టులు ఖాళీగా ఉంటే ప్రజలకు ఎంతవరకూ సేవలందుతాయనే విషయాన్ని పాలకులు గుర్తించాలి. త్వరితగతిన పోస్టుల భర్తీ చేయాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.

ఉద్యోగుల ఖాళీలు భారీగానే..

సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ల పరిస్థితి కూడా అలానే ఉంది. రికార్డు అసిస్టెంట్లు 18 పోస్టులు, లైబ్రరీ అసిస్టెంట్లు 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆఫీస్ సబార్డినేట్లు 484 పోస్టులకు 65 మంది మాత్రమే పనిచేస్తుండగా 418 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక క్లాస్–4 ఉద్యోగులు 185 పోస్టులకు 8 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. క్లాస్–4 ఉద్యోగుల పోస్టులు 177 ఖాళీగా ఉన్నాయి.

త్వరలో సమీక్షిస్తా..



జిల్లా పరిషత్‌లో ఖాళీల భర్తీపై త్వరలో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం. నూతనంగా నేను బాధ్యతలు తీసుకున్నాను. పరిపాలనకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తాం. సమీక్షా సమావేశం ద్వారా తగు నిర్ణయం తీసుకుంటాం.

– ఎం.శ్రీహరి, జెడ్పీ సీఈఓ

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

కలెక్టర్ వెట్రిసెల్వి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, జెడ్పీ సీఈఓ ఎం.శ్రీహరి తదితరులతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. పీజీఆర్‌ఎస్‌లో అందిన అర్జీల పరిష్కార సరళిపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీఓపెన్‌కు కాకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఆంక్షలతో అవస్థలు



పింఛన్ పెంపు కోసం..

ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు వినతులు వెల్లువెత్తాయి.. తల్లికి వందనం రావడం లేదని తల్లులు, పింఛన్ పెంచాలని దివ్యాంగులు, సదరం సర్టిఫికెట్ ఇవ్వడం లేదని విభిన్న ప్రతిభావంతులు ఇలా తమ కష్టాలు చెప్పుకోవాలని వచ్చిన వారు పోలీసుల ఆంక్షలు, తనిఖీలు చూసి ఇబ్బంది పడే పరిస్థితి వచ్చింది. కలెక్టర్‌ను కలవడానికి వస్తే ఇన్ని అడ్డంకులా అంటూ పలువురు బహిరంగంగానే విమర్శించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



చెక్ చేస్తున్న పోలీసులు



ఏలూరు కలెక్టరేట్‌లో అర్జీదారుల పడిగాపులు

క్లుప్తంగా

షార్ట్ ఫిల్మ్ పోటీల్లో అవార్డు


వంశీకృష్ణంరాజు

కాళ్ల: షార్ట్ ఫిల్మ్ ఉత్తమ డైరెక్టర్ అవార్డును కాళ్ల మండలం కోపల్లె వాసి ఇందుకూరి వంశీకృష్ణంరాజు దక్కించుకున్నారు. ఈనెల 20న కోల్‌కతాలో జరిగిన 14వ అంతర్జాతీయ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నట్లు సోమవారం ఆయన కుటుంబీకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 1000 మంది పాల్గొన్న ఈ పోటీల్లో వంశీకృష్ణంరాజు దర్శకత్వం చేసిన ‘పర్వస్థ’ అనే షార్ట్ ఫిల్మ్ మొదటి స్థానంలో నిలిచి ‘ఉత్తమ దర్శకుడు – జ్యూరీ’ అవార్డును అందుకున్నారని తెలిపారు. వంశీకృష్ణంరాజు ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ ప్రాంతానికి చెందిన మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మరడాని రంగారావు కాలనీకి చెందిన కొప్పుల మహేష్‌కు, అఖిల (22) కు రెండేళ్ళ క్రితం వివాహమైంది. వీరికి 11నెలల కుమారుడు ఉన్నాడు. భర్త మహేష్ గత నెలలో రవాణా వాహనాన్ని కొనుగోలు చేశాడు. అఖిల తన తల్లిని రూ.లక్ష ఆర్థిక సాయం చేయాలని కోరింది. ఇటీవల మరోసారి ఆర్థిక సాయం చేయాలని కోరగా ఆమె నిరాకరించింది. తీవ్ర మనస్తాపానికి గురైన అఖిల ఈ నెల 15న ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. ఆమె చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించటంతో సోమవారం మృతిచెందింది.

చోరీ బైక్‌ల స్వాధీనం

ఏలూరు టౌన్: రెండు బైక్‌లు చోరీ చేసిన ఘటనలో బాలుడిని వన్‌టౌన్ పోలీసులు శనివారపుపేటలోని బాలుర వసతి గృహానికి తరలించారు. అతని నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 10న ఏలూరు గడియార స్తంభం సెంటర్‌లో ప్లేజోన్ స్కూల్లో రూ.1800 నగదు అపహరణకు గురైంది. స్కూల్ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయగా.. బాలుడు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అతను మరో రెండు బైక్‌లు సైతం చోరీ చేసినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ క్రైంపై ఫిర్యాదు

కైకలూరు: కైకలూరు మండలం వరహాపట్నం గ్రామానికి చెందిన బోయిన నాగశ్రీనువాసు ఫోన్‌కు ఇటీవల ఒక యాప్ రావడంతో దానిని ఇన్‌స్టాల్ చేశాడు. వెంటనే సెల్‌ఫోన్ డెడ్ అయ్యింది. ఎయిర్‌టెల్ షోరూంకు వెళ్ళి బాగు చేయించాడు. వెంటనే రెండు హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.లక్షా 30 వేలు, రూ.74 వేలు విలువ చేసే రెండు ఐఫోన్‌లు కొనుగోలు చేశారని నగదు చెల్లించాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి మెసేజ్‌లు వచ్చాయి. సైబర్ నేరగాళ్లు నాగశ్రీనువాసు వివరాలను సేకరించి లోన్ తీసుకున్నట్లు క్రియేట్ చేశారు. నాగశ్రీనువాసుకు కై కలూరు హెచ్‌డీఎఫ్‌సీలో ఖాతా ఉంది. బ్యాంకు అధికారులను సంప్రదిస్తే అతని పేరుతోనే లోన్ ఉందని తెలిపారు. పోలీసులను ఆశ్రయించగా.. సైబర్ నేరంగా కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ములపర్రులో గోదావరిని తలపిస్తున్న వరిచేలు


సిద్ధాంతంలో నీట మునిగిన వరి నాట్లు

వరిని ముంచిన వరుణుడు


గుడిపాడు వద్ద చెరువును తలపిస్తున్న వరి చేలు

పెనుగొండ: అనావృష్టి.. అతి వృష్టితో వరి రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. నిన్న మొన్నటి వరకు నీరందక నారుమళ్లు ఎండితే.. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నారుమళ్లు, వరినాట్లు నీటమునిగాయి. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, ఆచంట మండలాల్లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి. ఇంకా వరి నాట్లు వేయని నడిపూడి, చినమల్లం, తామరాడ, కొఠాలపర్రు వంటి ప్రాంతాల్లో వర్షం ఉపశమనం కల్పించినా, సిద్ధాంతం, రామన్నపాలెం, దేవ, ఇలపర్రు గ్రామాల్లో వరి నాట్లు వేసిన చేలను వర్షం ముంచేసింది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరి నాట్లు కుళ్లిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకాలువలు, మురుగు కాలువలు వర్షపు నీటితో నిండిపోవడంతో వరి చేలల్లో నీరు నిలిచిపోయింది. సోమవారం సైతం వర్షం పడుతుండడంతో చేలల్లో నీరు తీయడం కష్టంగా మారింది.

సింగవరంలో తాగునీటి కష్టాలు


రంగుమారిన తాగునీటిని చూపిస్తున్న మహిళలు



బోర్డుపై నమోదు చేయని క్లీనింగ్, బ్లీచింగ్ తేదీలు

దెందులూరు: సీతంపేట పంచాయితీ శింగవరంలో తాగునీటి కష్టాలు శాశ్వతంగా తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. గోదావరి కాల్వ నుంచి ఫిల్టర్ చేయకుండా పంపుల ద్వారా సరఫరా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ నిబంధనల ప్రకారం రక్షిత మంచినీటి పథకాల్లో తాగునీటిని బ్లీచింగ్ చేసి, ట్యాంక్ క్లీనింగ్ చేయాలి. ఈ రెండు పనులను ట్యాంక్ బోర్డు మీద విధిగా నమోదుచేయాలి. ఈ రెండు పనులు చేయడం లేదు. రంగు మారిన ఫిల్టర్ చేయని నీరు ఎలా తాగాలని.. మాకు మాత్రమే ఎందుకిలా సరఫరా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. తాగునీటికి సంబంధించి కలెక్టర్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇస్తున్నప్పటికీ తమ ప్రాంతంలో మాత్రమే తాగునీరు సక్రమంగా లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ఇక్కట్లుపై ఆర్‌డబ్ల్యూఎస్ దెందులూరు మండల ఏఈ వర్మను వివరణ కోరగా సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు.

‘ఆది కర్మయోగి’ అమలుపై సమీక్ష


కర్మయోగి కార్యక్రమంపై సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): గిరిజనుల అభివృద్ధి కోసం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన సంక్షేమ వ్యవహారాల శాఖ కార్యదర్శి వివిధ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఆది కర్మయోగి కార్యక్రమం అమలుపై సోమవారం సాయంత్రం ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కె.వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని, వాటి ఫలితాలు మారుమూల గిరిజన ప్రాంతాలకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గిరిజనుల సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అందించేందుకు ఆది కర్మయోగి కార్యక్రమం ద్వారా గిరిజన సంక్షేమ పథకాల అమలులో అధికారుల సామర్థ్యాన్ని పెంచడం, వారిని మరింత ప్రభావవంతంగా పనిచేయడానికి ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఆది కర్మయోగి కార్యక్రమం కింద ప్రభుత్వ అధికారులకు గిరిజన సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు గిరిజన సంక్షేమ శాఖలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాములు నాయక్, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కొయ్యలగూడెం: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని అక్రమార్కుల పాలనలో అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయని వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్ రెడ్డిని తన ప్రమేయం లేని వ్యవహారంలో తప్పుడు కేసులో ఇరుకునపెట్టడం కక్ష సాధింపు చర్య అన్నారు. ఎక్సైజ్ శాఖతో సంబంధంలేని ఎంపీని అరెస్టు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనంగా మారిందన్నారు. 2014–19 టీడీపీ పాలనలోనే మద్యం మాఫియా రాజ్యం నడిచిందన్నారు. ప్రివిలేజ్ ఫీ రద్దుతో రాష్ట్రానికి ప్రతి సంవత్సరం రూ.1300 కోట్లు నష్టం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 43,000 బెల్ట్ షాపులు రద్దు చేశామని, లిక్కర్ అవుట్‌లెట్లను 4,380 నుంచి 2,934కి తగ్గించామన్నారు. ఈ–పేమెంట్ విధానం ప్రవేశపెట్టి పారదర్శకత తీసుకువచ్చామని చెప్పారు. కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వైఎస్సార్‌సీపీ హయాంలో లిక్కర్ పాలసీ హేతుబద్ధంగా జరిగిందని కితాబు ఇచ్చిందన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి


ప్రమాదంలో మృతి చెందిన అనిత, తీవ్రంగా గాయపడిన మోజెస్

ముసునూరు: వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లిన మహిళ, ఆస్పత్రికి చేరకుండానే అనంత లోకాలకు చేరిన సంఘటన మండలంలో జరిగింది. సోమవారం లోపూడి గ్రామానికి చెందిన తాణంకి రాంబాబు భార్య అనిత (30) తన చిన్న కుమారుడితోపాటు, సమీప బంధువు దిరిశనపు మోజెస్ బైక్‌పై రమణక్కపేట పీహెచ్‌సీకి వెళ్లారు. చెక్కపల్లి–రమణక్కపేట ప్రధాన రహదారిలో చెక్కపల్లి దాటిన తర్వాత లారీ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో అనిత అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె కుమారుడికి గాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న యువకుడి ఎడమ చేయి దెబ్బతింది. వారిని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మోజెస్‌ను మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్టం అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు.

యాసిడ్ తాగి వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: అప్పులు తీర్చే పరిస్థితులు కానరాకపోవటంతో యాసిడ్ తాగి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వెంకటరావుపేట ప్రాంతానికి చెందిన వేముల శ్రీనివాస్ (54) భార్యతో కలిసి జీవిస్తున్నాడు. వీరికి ముగ్గురు సంతానం కాగా అందరికీ వివాహాలు చేశారు. ప్రస్తుతం శ్రీనివాస్ కొత్తపేట సమీపంలో కిరణా దుకాణం నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా పలు రకాల ఫైనాన్స్ కంపెనీల నుంచి సుమారు రూ.15 లక్షల వరకూ అప్పులు చేశాడు. తిరిగి చెల్లించే పరిస్థితి లేకపోవటంతో ఏమి చేయలేని దైన్యస్థితిలో సోమవారం ఉదయం ఇంట్లోనే యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించటంతో చికిత్స పొందుతూనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

లారీ ఢీకొని బావ, బావమరిది దుర్మరణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిపై హనుమాన్ జంక్షన్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బావ, బావమరిది దుర్మరణం చెందారు. ఏలూరు జిల్లా దేవరపల్లి సమీపంలో పల్లంట్ల చెందిన పసలపూడి రాఘవ (30), ఆయన బావ తాడేపల్లిగూడెం సమీపంలోని కృష్ణంపాలెం చెందిన ఎల్లిమెల్లి భాస్కరరావు (50)తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా దుర్ఘటన జరిగింది. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న భాస్కరరావును విజయవాడలోని ఆస్పత్రికి రాఘవ తీసుకెళ్తున్నారు. హనుమాన్‌జంక్షన్ బైపాస్ రోడ్డులో శేరినరసన్నపాలెం క్రాస్ రోడ్డు దాటిన తర్వాత వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. ఘటనలో తీవ్రగాయాలతో రక్తస్రావమైన ఇద్దరూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు నగరం జ్యూట్‌మిల్లు ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. మృతుడి వయసు 55 ఏళ్లు ఉంటుందని అంచనా. మృతుడు లేత నీలం రంగు టీషర్ట్, ముక్కుపొడుం రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆచూకీ తెలిస్తే ఏలూరు రైల్వే ఎస్‌ఐ పీ.సైమన్, ఫోన్ నెంబర్ 9989219559కు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యతో పాటు క్రీడలపై దృష్టిపెట్టాలి

ఏలూరు(మెట్రో): రాష్ట్ర సబ్ జూనియర్ అండ్ జూనియర్స్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కలెక్టరు కె.వెట్రిసెల్వి, జాయింటు కలెక్టరు పి. ధాత్రిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని అన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు క్రీడలతోనే సాధ్యమని యువత విద్యతోపాటు సమానంగా క్రీడల పట్ల మొగ్గు చూపాలని కోరారు. జాతీయ స్థాయిలో బాగా పతకాలు సాధించాలని, క్రీడాకారులకు ఎలాంటి సదుపాయాలు కావాలన్నా ప్రభుత్వ పరంగా అన్ని సమకూర్చుతామని కలెక్టరు కె.వెట్రిసెల్వి అన్నారు.

స్విమ్మింగ్‌లో అవార్డులు

ఈ నెల 19 నుంచి 20 జరిగిన రాష్ట్ర సబ్ జూనియర్ అండ్ జూనియర్స్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలలో ఏలూరు జిల్లా నుండి 20 మంది పాల్గొనగా అందులో ఏలూరు క్రీడా ప్రాధికార సంస్థ స్విమ్మింగ్ పూల్ నుంచి ఆరుగురు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. బలగ స్వామి నాయుడు 5 బంగారు పతకాలు సాధించి వ్యక్తిగత చాంపియన్ షిప్ అవార్డును, ఏపీ ఫాస్టెస్ట్ స్విమ్మర్‌గా నిలిచినట్లు అధికారులు తెలిపారు. ఎం.ధనుష్‌సాయి 2 బంగారు పతకాలు, 2 రజత పతకాలు, 1 కాంస్య పతకాలు, జర్జాన యశస్విని 2 బంగారు పతకాలు, ఉన్నమట్ల మోహన దీప్తి 2 కాంస్య పతకాలు, అడ్డాడ రిశ్వంత్, షేక్ హకీల్ కాంస్య పతకాల్ని సాధించారు. బలగ స్వామి నాయుడు, మరుబరిక ధనుష్ సాయి జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. జాతీయ జూనియర్ వాటర్ పోలో గేమ్‌కు అడ్డాడ రిశ్వంత్, షేక్ హకీల్ ఎంపిక అయ్యారు.

అధ్యాపకుల సర్దుబాటు మేరకే టైం టేబుల్

నూజివీడు: ఈ విద్యాసంవత్సరం శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు సంబంధించిన పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలోనే తరగతులు నిర్వహిస్తున్నందున అధ్యాపకుల సర్దుబాటు అనివార్యమైందని డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ సోమవారం తెలిపారు. ‘టైం టేబుల్‌పై ట్రిపుల్ ఐటీలో రగడ’ శీర్షికన ప్రత్యేక కథనాన్ని సాక్షి ప్రచురించిన సంగతి విదితమే. దీనికి వివరణనిస్తూ విద్యాసంస్థలో పనిచేసే ఏ అధికారి అయినా విధాన నిర్ణయాలను అనుసరిస్తారే తప్ప వ్యక్తిగత నిర్ణయాలకు ప్రాధాన్యతనివ్వరన్నారు. దీనిలో భాగంగానే తెలుగు శాఖలో తొమ్మిది మంది అధ్యాపకులుండగా అందరికి సమానమైన వర్క్ లోడు ఉండాలనే అభిప్రాయమే తప్ప ఎలాంటి వ్యక్తిగత దురుద్దేశాలకు, పక్షపాత ధోరణికి ఆస్కారం లేదని పేర్కొన్నారు. అకడమిక్ విషయాల్లో డీన్ యూనివర్సిటీ నిబంధనలు అనుసరించి పనిచేస్తారన్నారు. విద్యావసరాలను బట్టి పీయూసీకి చెప్పే వారిని బీటెక్, బీటెక్‌లో చెప్పే అధ్యాపకులను పీయూసీలో బోధన చేస్తుంటారని, ఈ క్రమంలోనే అధ్యాపకులకు, మెంటార్లకు సమాన ప్రాధాన్యం ఇచ్చే ఉద్దేశంతోనే టైంటేబుల్‌ను వేశారన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల వెరిఫికేషన్ పూర్తి చేయాలి

ఏలూరు(మెట్రో): అగ్రిగోల్డ్‌కు సంబంధించి ప్రభుత్వం అటాచ్ చేసిన ఆస్తులు, భూములకు సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర భూపరిపాలన శాఖ చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి సంబంధిత జిల్లాల జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. అగ్రిగోల్డ్ ఆస్తులకు సంబంధించి భూముల గుర్తింపు, ప్రభుత్వ విలువ, ప్రైవేట్ మార్కెట్ విలువ, మ్యుటేషన్, తదితర అంశాలపై రాష్ట్రంలోని వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులకు సంబంధించి భూములను భౌతికంగా పరిశీలించి మ్యుటేషన్ పనులు పూర్తి చేయాలన్నారు.